అందరూ ఫస్ట్‌క్లాస్ వస్తుందా, డిస్టింక్షన్ వస్తుందా అని ఆలోచిస్తుంటే, సూర్యారావు పాసవుతానా లేదా అని ఆలోచించసాగేడు.

ఆయన అన్ని పేపర్లు బాగానే వ్రాశాడు. కాని ఎకనమిక్స్ పేపరు మాత్రం బాగా వ్రాయలేకపోయానన్న భయం వుంది. మొదటినుంచి ఆ "ఎకనమిక్స్" అతన్ని వేధిస్తూనే వుంది. పి. యు. సి. లో "లా ఆఫ్ డిమినిషింగ్ యుటిలిటీ" అంటూ ఏదో చెప్పున్నప్పుడే అనుకొన్నాడు— "యీ సబ్జక్టు నాకొంప కూలుస్తుందని." ఆ "లా" ఏమిటో అతనికి వొక్క ముక్క అర్థం కాలేదు. చదివితే అసలు బోధపడలేదు. చివరికి ఎవరో చెప్పారు. "లా ఆఫ్ డిమినిషింగ్ యుటిలిటీ అంటే ఏముందండీ, తినగా తినగా గారెలు చేదు అంటారు చూడండి మనవాళ్ళు. అదే" అని ఆ సామెతతో సమన్వయం చేసుకొంటూ చదివితే కాస్త అర్థమయింది.

అప్పటినుంచి ఆ "ఎకనమిక్స్" అంటే భయమే. ఉద్యోగాల్లో షెడ్యూలుకేస్టు వాళ్ళకు ప్రిఫరెన్సు యిచ్చినవిధంగా దానికి ప్రిఫరెన్సు యిచ్చి చదువుతూనే వున్నాడు. అయితేనేం కాక ? పగపట్టిన ఆఫీసరు గుమాస్తా "కాన్‌ఫిడిన్‌షియల్" రిపోర్టు చెడగొట్టినట్లు, ఆ "ఎకనమిక్స్" అతన్ని పరీక్షనాడు కాటెయ్యనే వేసింది. చదివినవి చాలా రాలేదు. వచ్చిన వాటిని సరిగా ఆన్సర్ చేశానన్న నమ్మకం కుదర్లేదు సూర్యారావుకు.

ఫలితాలు ప్రచురించేరోజు దగ్గర పడే కొద్ది ఆఫీసులో అంతా సూర్యారావు విషయమే మాట్లాడుకోసాగేరు. అతని సర్వీసు యింకో ఆరు నెల్లో ఎనిమిదినెల్లో వుంటుంది. బి. ఎ. కాగానే ఎమ్. ఎ. చదువుతాడా ? బి. యిడి. చదువుతాడా? లేక ఏం చేస్తాడు ?....యమ్మే చదవమని వొకరు సలహాయిచ్చారు. బి. యిడి. చదివి రిటైరయ్యాక బడిపంతులు కమ్మన్నారు మరికొందరు. చివరి కోరోజు పెద్దఆఫీసరుకూడా యిదేవిషయం అడిగాడు.

"ముందు పాస్ కానీయండి సార్" అని జవాబిచ్చాడు సూర్యారావు.

